సాక్షి సిద్దిపేట

సోమవారం । 23 । సెప్టెంబర్ । 2024

న్యూస్‌రీల్

సిద్దిపేట వనిత క్లబ్‌కు 17 అవార్డులు



అవార్డులతో వనిత క్లబ్ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలో నిర్వహిస్తున్న వివిధ సేవా కార్యక్రమాలకు వనిత క్లబ్‌కు 17 అవార్డులు వరించాయి. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మాంకాల ప్రాంతీయ సదస్సులో సేవా కార్యక్రమాలు చేసిన క్లబ్‌లకు అవార్డులు అందించారు. సిద్దిపేటలో వనిత క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం, దుస్తులు, కుట్టు మిషన్లు, పేద యువతుల వివాహాలకు పుస్తెమట్టెల పంపిణీ, తదితర సేవా కార్యక్రమాలకు వనితక్లబ్ అధ్యక్షురాలు మర్యాలవాణికి, వాసవీక్లబ్ రీజియన్ అధ్యక్షులు మాంకాల శ్రీనివాస్ అన్నపూర్ణ అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వాసవీక్లబ్, వనిత క్లబ్‌ల సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన నాగపురి



మంత్రికి వివరాలు సమర్పిస్తున్న నాగపురి రాజలింగం, కిరణ్‌కుమార్

చేర్యాల(సిద్దిపేట): మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం నగరంలోని మంత్రి నివాసంలో వారు కలిసి జనగామ నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టిన సేవా కార్యక్రమాలు, అందించిన ఆర్థిక సహాయం సంబంధించిన వివరాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పరిశీలించిన మంత్రి వెంటనే వారిని అభినందించి, పార్టీ, ప్రభుత్వ పథకాలను మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలని సూచించారు. భవిష్యత్తులో పార్టీ మంచి అవకాశం కల్పిస్తుందని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

నేటి నుంచి కబడ్డీ పోటీలు

సిద్దిపేటఎడ్యుకేషన్: ఇంటర్ విద్యాశాఖ ఆధ్వర్యంలో అండర్-19 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కబడ్డీ క్రీడా పోటీలను సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి (డీఐఈఓ) రవీందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లాలోని జూనియర్ కళాశాలల విద్యార్థులందరూ ఈ పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈ నెల 23 నుంచి 25వరకు బాలురకు, 26 నుంచి 28వరకు బాలికలకు పోటీలు ఉంటాయన్నారు.

29న 'మంజీరా' వార్షికోత్సవం



కరపత్రం ఆవిష్కరిస్తున్న మరసం ప్రతినిధులు

సిద్దిపేటకమాన్: మంజీరా రచయితల సంఘం (మరసం) 38వ వార్షికోత్సవం ఈ నెల 29న నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు రంగాచారి, ప్రధాన కార్యదర్శి యాదగిరి తెలిపారు. ఆదివారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మరసం ప్రతినిధులు వార్షికోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సిద్దిపేట విపంచి ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు. మరసం కవులతో కవి సమ్మేళనం ఉంటుందని తెలిపారు. కార్యక్రమానికి మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ నేత విరాత్ హలీ, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి, అంజయ్య, రాజశేఖర్‌రెడ్డి, కిషన్, సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయలకు పోటెత్తిన భక్తులు

పాపన్నపేట(మెదక్): వనదుర్గమ్మా.. మము దీవించమ్మా అంటూ వేలాది భక్తులు ఆదివారం అమ్మవారిని వేడుకున్నారు. అర్చకులు దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం పోసి, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఇబ్బంది కలగకుండా ఆలయ సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

వినాయకా.. వీడ్కోలికా..

దుబ్బాకలో అట్టహాసంగా ముగిసిన నిమజ్జనం



నిమజ్జనానికి బయలుదేరిన గణనాథులు

దుబ్బాకటౌన్/దుబ్బాక: పట్టణంలో పక్షం రోజులుగా సాగిన గణపతి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. డప్పు చప్పుళ్లు, యువతీ యువకుల నృత్యాలతో కనులపండువగా సాగింది. దుబ్బాక వినాయక నిమజ్జనోత్సవం అంటేనే జిల్లాలో ఒక ప్రత్యేకత. నిమజ్జనాన్ని వీక్షించడానికి నలు మూలల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీకగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రలో అఘోరాల వేషధారణ, డోలు కళాకారుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు చేసిన లైటింగ్, ఎల్‌ఈడీ స్క్రీన్లు చూపరులను ఆకట్టుకున్నాయి.



శ్రీరాముని భారీ కటౌట్

40 మంది గజ ఈతగాళ్లు

ఉత్సవ నిర్వాహకులు భారీ విగ్రహాలను ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. 40 మంది గజ ఈతగాళ్లతో వినాయకులను నిమజ్జనం చేశారు. పోలీసులు సైతం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.



గణపయ్యా.. వెళ్లి రావయ్యా.. : నిమజ్జనం చేస్తున్న భక్తులు

గజ్వేల్@ గ్రేడ్ 2

మున్సిపాలిటీ హోదా పెంపు!

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ.. వేగంగా విస్తరిస్తూ గ్రేడ్–2 మున్సిపాలిటీ కళను సంతరించుకోబోతున్నది. బహుళ ప్రయోజనాలు చేకూరనున్నాయి. మల్లన్నసాగర్ ముంపు గ్రామాలు (ఆర్‌అండ్‌ఆర్ కాలనీ) ఈ మున్సిపాలిటీలో విలీన ప్రతిపాదనపై ఇప్పటికే అభిప్రాయాలను సేకరించింది. యాభైశాతం మంది వద్దని, మిగిలిన శాతం మంది కావాలని చెప్పడంతో ప్రభుత్వం మాత్రం విలీనానికే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ప్రధాన రోడ్డు

- తాజాగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీ విలీనానికి అభిప్రాయ సేకరణ
- విలీనంవైపే ప్రభుత్వం మొగ్గు
- త్వరలోనే కార్యాచరణకు అవకాశం
- పెరగనున్న వార్డుల సంఖ్య
- మారనున్న రూపురేఖలు

గజ్వేల్: గ్రేడ్ 2 హోదాతో మున్సిపాలిటీ రూపురేఖలు మారనున్నాయి. మల్లన్నసాగర్ నిర్వాసిత గ్రామాలైన పల్లెపహాడ్, వేములఘాట్, ఏటిగడ్డకిష్టాపూర్, ఎర్రవల్లి, సింగారంతోపాటు లక్ష్మాపూర్, రాంపూర్, బ్రాహ్మణ బంజేరుపల్లి తదితర గ్రామాల ప్రజలకు మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లి, సంగాపూర్ గ్రామాల మధ్య ఆర్‌అండ్‌ఆర్ కాలనీని నిర్మించి ఇచ్చిన సంగతి తెల్సిందే. కాలనీలో నివాసముంటున్నా.. 2020 నుంచి ఇప్పటివరకు ఆయా గ్రామాలు పంచాయతీలుగానే కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఆయా గ్రామాల పరిధిలో 15వేల జనాభా, మరో 13వేల మంది ఓటర్లు ఉన్నారు. తాజాగా పంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్న వేళ.. ఈ గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయడానికి కసరత్తు మొదలైంది. ఈ క్రమంలో ప్రభుత్వం ఇటీవల నిర్వాసితుల అభిప్రాయాలను తీసుకున్నది. ప్రజా ప్రతినిధులు, ముఖ్యుల అభిప్రాయాలను సేకరించగా, ఈ సందర్భంగా 50శాతం మంది పంచాయతీలుగానే కొనసాగుతామని, మరో 50శాతం మంది మున్సిపాలిటీలో విలీనమవుతామనే అభిప్రాయాన్ని వెల్లడించినట్లు తెలిసింది. ప్రభుత్వం మాత్రం గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయడానికి మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది.

పెరగనున్న జనాభా

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధి ప్రస్తుతం 49 చదరపు కిలోమీటర్లు పరిధి కలిగి ఉంది. ప్రస్తుతం మున్సిపాలిటీలో గజ్వేల్‌తో పాటు ప్రజ్ఞాపూర్, రాజిరెడ్డిపల్లి, సంగాపూర్, క్యాసారం, ముట్రాజ్‌పల్లి గ్రామాలు ఉన్న సంగతి తెలిసిందే. దీంతో పట్టణ జనాభా 55వేలకు చేరుకుంది. ఆర్‌అండ్‌ఆర్ కాలనీ విలినమైతే జనాభా 70వేలకు చేరుకోనున్నది. ప్రస్తుతం వార్డుల సంఖ్య 20 ఉండగా, మరో 12వార్డుల అదనంగా పెరగనున్నాయి. దీని ద్వారా గజ్వేల్–ప్రజ్ఞాపూర్ గ్రేడ్–2 మున్సిపాలిటీగా అవతరించనున్నది.

గతంలో గ్రేడ్ వన్ ప్రతిపాదనకు బ్రేక్

ఈ మున్సిపాలిటీని గ్రేడ్ వన్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయడానికి 2018లో ప్రతిపాదనలు తయారు చేశారు. మున్సిపాలిటీ సరిహద్దు నుంచి 5కిలోమీటర్లలోపు దూరంలో ఉన్న అక్కారం, ధర్మారెడ్డిపల్లి, జాలిగామ, బయ్యారం, కోమటిబండ, శ్రీగిరిపల్లి, దాచారం, రిమ్మనగూడ, పాతూర్ గ్రామాలను విలీనం చేయాలని ప్రతిపాదించారు. ఈ గ్రామాల విలీనంతో జనాభా 80వేలకు పెరిగినా, పట్టణ వైశాల్యం భారీగా 138 చదరపు కిలోమీటర్లకు పెరనుందని, దీని వల్ల సమస్యలు తలెత్తుతాయని మున్సిపల్ శాఖ గుర్తించింది. కార్పొరేషన్ స్థాయిలో వైశాల్యం పెంచినా జనాభా 80వేలే ఉండటం మరో మైనస్ పాయింట్‌గా మారింది. కొత్తగా విలీనమయ్యే 9 గ్రామాల ప్రజలు మున్సిపల్ విధానాన్ని అలవాటుపడక, పన్నుల పెరిగి ఇబ్బందులు వస్తాయని కూడా గుర్తించారు. స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉండి.. కార్పొరేషన్ వైపు అడుగులు వేస్తున్న జిల్లా కేంద్రమైన సిద్దిపేట ప్రస్తుత వైశ్యాలం 36.09 చదరపు కిలోమీటర్లు మాత్రమే. కానీ గజ్వేల్‌ను గ్రేడ్ -1 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తే వైశాల్యం అసాధారణంగా ఉండటం వల్ల పరిపాలన సౌలభ్యానికి భంగం వాటిల్లే ప్రమాదముందని మున్సిపల్ శాఖ రాష్ట్ర అధికారులు గుర్తించారు. దీనివల్ల గతంలో ఈ ప్రతిపాదనను పక్కన పెట్టారు.

గురుకులాలపై తప్పుడు ప్రచారం తగదు

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న నర్సారెడ్డి, నాయకులు

గజ్వేల్: గురుకులాలపై తప్పుడు ప్రచారం చేయొద్దని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. ఆదివారం గజ్వేల్‌లోని మైనారిటీ గురుకుల పాఠశాలను మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్‌లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌కు చెందిన ఓ నాయకుడు గురుకుల విద్యపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు చేపడుతుండగా, తప్పుడు విమర్శలు సరికావన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించడానికే బీఆర్‌ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ ద్వారా కాకుండా, ప్రస్తుతం ఎల్లంపల్లి నుంచి మల్లన్నసాగర్‌లోకి నీళ్లు వస్తుండగా మాజీ మంత్రి హరీశ్‌రావు ఈ అంశంపై ప్రజల దృష్టిని మరల్చేందుకే రిజర్వాయర్‌ను సందర్శించారని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. కాగా నర్సారెడ్డి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

'సెల్ఫీ ఫర్ రుణమాఫీ'



రైతులతో కలిసి సెల్ఫీ వీడియోలు తీస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

- వినూత్న రీతిలో ఉద్యమం
- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి శ్రీకారం

మిరుదొడ్డి(దుబ్బాక): అర్హులైన ప్రతి రైతుకు పూర్తి స్థాయిలో రూ.2 లక్షల రుణమాఫీ అయ్యే వరకు రైతులతో కలిసి సెల్ఫీ ఫర్ రుణమాఫీ ఉద్యమానికి శ్రీకారం చుట్టినట్లు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మిరుదొడ్డి మండలం ధర్మారంలో రుణమాఫీ కాని రైతులతో కలిసి వినూత్న రీతిలో సెల్ఫీ ఫర్ రుణమాఫీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సెల్ఫీ వీడియోలు తీసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ కాని రైతులు ఎంత మనోవేదనకు గురవుతున్నారో కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలియజేయడానికే డిజిటల్ ఉద్యమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ట్యాగ్ చేసిన సెల్ఫీ వీడియోలను ట్విట్టర్, ఫేస్ బుక్ ద్వారా సీఎంఓ కార్యాలయానికి పంపిస్తామన్నారు. రైతు పంట రుణాలను వంద శాతం మాఫీ చేశామని అసత్య ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణమాఫీ కాని రైతుల సెల్ఫీ వీడియోలే తగిన గుణపాఠం చెబుతాయని హెచ్చరించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పునరాలోచించి అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాజులు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు సూకూరి లింగం, మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వీయ రక్షణకు కరాటే దోహదం



సమావేశంలో పాల్గొన్న ఆల్ కరాటే అసోసియేషన్ ప్రతినిధులు

గజ్వేల్‌రూరల్: స్వీయ రక్షణకు కరాటే దోహదపడుతుందని కరాటే ఇండియా అసోసియేషన్ ఆర్గనైజేషన్ సభ్యులు అన్నారు. ఆదివారం గజ్వేల్‌లో ఆల్ కరాటే స్టైల్స్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వల్ల అత్యవసర సమయాల్లో స్వీయరక్షణకు దోహదపడుతుందని, ప్రస్తుత సమాజంలో ఆడ పిల్లలకు ఈ విద్య ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు కరాటేలో నైపుణ్యం సాధించేలా తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఆయా మండలాలకు ఇన్‌ఛార్జిలను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆల్ కరాటే అసోసియేషన్ ప్రతినిధులు నరేష్, ఆంజనేయులు, భాగ్యరాజు, నివాస్, బి. నరేష్, సుధాకర్, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న క్షేత్రంలో భక్తుల సందడి



స్వామి వారి రాజగోపురం ఎదుట భక్తుల సందడి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మల్లన్న నామస్మరణతో ఆలయ పరిసరాలన్నీ మారుమోగాయి. సుమారు 8 వేల మంది స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. స్వామి వారిని దర్శిచుకుని ఒడి బియ్యం, పట్నాలు, గంగిరేణి చెట్టుకు ముడుపులు కట్టి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఆలయ సిబ్బంది పరిశీలించారు.



పట్నాలు వేస్తున్న భక్తులు

బొడ్డెమ్మ.. బొడ్డెమ్మా కోల్..



బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు (ఫైల్)

- నేటి నుంచే పండుగ
- ఊరూరా సందడే
- చిన్నారులు, యువతుల ఆటాపాట
- వచ్చే నెల 2 వరకు వేడుకలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల్లో భాగమైన బొడ్డెమ్మ వేడుకలు ఊరూరా ఘనంగా కొనసాగనున్నాయి. 'బొడ్డెమ్మ.. బొడ్డెమ్మా కోల్..' అంటూ వాడవాడలా ఆడబిడ్డలు సందడి చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి బొడ్డెమ్మ పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించుకునేందుకు జిల్లాలోని యువతులు సిద్ధమయ్యారు. బొడ్డెమ్మ పండుగ అనగానే గుర్తుకొచ్చేది, యువతుల పండుగ. వివాహం కాని యువతులు, చిన్నారులు ఆడే పండుగే బొడ్డెమ్మ. ఈ పండుగ వచ్చే నెల 2వరకు నిర్వహించనున్నారు.

బతుకమ్మకు ముందు వేడుక..

ఎంగిలిపూల బతుకమ్మకు ముందుగా నిర్వహించే పండుగే బొడ్డెమ్మ. చతురస్రాకారంలో ఉన్న చెక్కపై పుట్టమన్నుతో దొంతురాలుగా, గోపురం ఆకారం వచ్చే వరకు నిర్మించి, వీటిలో పూలు పెడుతారు. ప్రతి రోజు ఈ పూలను నిమజ్జనం చేస్తారు. బొడ్డెమ్మ పండుగ సందర్భంగా ప్రతి రోజు సాయంత్రం ఆడే ప్రాంతంలో శుభ్రం చేసి ఎర్రమట్టితో అలికి, ముగ్గులు వేస్తారు. ఈ ముగ్గులలో బొడ్డెమ్మలను తీసుకువచ్చి యువతులు చుట్టూ తిరుగుతూ పాటలు, ఆటలు ఆడుతారు. చివరి రోజు బొడ్డెమ్మలను చెరువుల వద్ద నిమజ్జనం చేస్తారు. అందుకు గాను అధికారులు చెరువుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది, దీంతో ముందుగానే బొడ్డెమ్మ, బతుకమ్మ పండుగల సందడి కనిపిస్తుంది.

సంతోషంగా జరుపుకొంటాం



మా మిత్రులందరం కలిసి బొడ్డెమ్మ ఆటలు ఆడుతాం. పది రోజుల పాటుగా మా వీధిలో బొడ్డెమ్మలను ఒకే చోట పేర్చి చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతాం. ఈ సందర్భంగా ప్రసాదాలు అందరం పంచుకుంటాం. ప్రతి రోజు సాయంత్రం వేళ బొడ్డెమ్మ ఆడి. అనంతరం చెరువు వద్దకు వెళ్లి పూలను నిమజ్జనం చేస్తాం. చెరువు వద్దకు వెళ్లడం సంతోషంగా ఉంటుంది. – వైష్ణవి, సిద్దిపేట

అందరం కలిసి ఆడుతాం



మేము అందరం కలిసి బొడ్డెమ్మల వేడకలు జరుపుకొంటాం. సాయంత్రం కాగానే పూలతో బొడ్డెమ్మలను అందంగా అలంకరిస్తాం. అన్ని బొడ్డెమ్మలను ఒకే చోట పెట్టి, పాటలు, ఆటలు ఆడుతాం. బొడ్డెమ్మ పండుగను బతుకమ్మ పండుగ వలే నిర్వహిస్తాం. ఆడిన తరువాత చెరువు వద్ద పాటలు పాడుతూ పూలను చెరువులో నిమజ్జనం చేస్తాం. – శ్రీజ, సిద్దిపేట

క్లుప్తంగా

పోలీసులమని చెప్పి.. దృష్టి మరల్చి..

- వృద్ధదంపతులకు టోకరా
- 3 తులాల బంగారం చోరీ

పటాన్‌చెరు టౌన్: పోలీసులమని చెప్పి.. వృద్ధ జంట దృష్టి మరల్చి బంగారంతో ఉడాయించారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండకు చెందిన కౌశిక్ బట్టాచార్య, భార్య అరుణతో కలిసి స్కూటీపై ఆదివారం పటాన్‌చెరు వైపు వస్తున్నాడు. రింగ్ రోడ్ సమీపంలోని వైన్స్ వద్దకు రాగానే ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్ పై వచ్చి స్కూటీని ఆపి పోలీసులమని చెప్పి దొంగతనాలు జరుగుతున్నాయని, బంగారం ఒంటిపై వేసుకొని వెళ్లకూడదని చెప్పారు. దీంతో ఆ వృద్ధ దంపతులు మూడు ఉంగరాలు, గొలుసును పేపర్‌లో కడుతుండగా తాము కట్టిస్తామని తీసుకున్నారు. బంగారం స్థానంలో రాళ్లను పెట్టి వాళ్ల చేతికి ఇచ్చి ఇక్కడ నుంచి పరారయ్యారు. ఆ తర్వాత గమనించిన వీరు వెంటనే పటాన్‌చెరు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకుని వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన వృద్ధుడు విగతజీవిగా..

వర్గల్(గజ్వేల్): ఇంటి నుంచి వెళ్లిన వృద్ధుడు నాచారం గుట్ట సమీపదేవుని చెరువులో ఆదివారం విగతజీవిగా కనిపించాడు. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం కుకునూరుకు చెందిన చెవుల పోచయ్య (60) మానసిక స్థితి సరిగా లేదు. 3 నెలల క్రితం అతడు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినప్పటికీ ఆచూకీ దొరకలేదు. ఆదివారం వర్గల్ మండలం నాచారం గుట్ట వెనుక వైపు దేవుని చెరువులో మృతదేహం తేలింది. మృతదేహాన్ని వెలికితీసి స్థానికులను విచారించగా మృతుడు కుకునూరు వాసిగా గుర్తించారు. కొద్దిరోజుల నుంచి నాచారం గుట్ట వద్దే ఉంటున్నాడని, కాలకృత్యాల కోసం చెరువు వైపు వెళ్లి ప్రమాదవశాత్తు అందులోనే పడి మృతిచెందాడని ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడి కుమారుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించినట్లు తెలిపారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పాపన్నపేట (మెదక్): ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని అర్కెల గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిట్యాల మొగులయ్య (52) హైదరాబాద్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయాన్నే గ్రామానికి వచ్చాడు. సాయంత్రం సమయంలో పొలానికి వెళ్లి అక్కడున్న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటుగా వెళ్తున్న స్థానికులు గమనించి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ విషయమై ఎస్సై శ్రీనివాస్ గౌడ్‌ను వివరణ కోరగా ఘటనకు సంబంధించి ఫిర్యాదు అందలేదన్నారు. మొగులయ్యకు భార్య సుగుణతో పాటు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

వృద్ధురాలి మృతదేహం స్వాధీనం


వృద్ధురాలి మృతదేహం

కొండపాక(గజ్వేల్): గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం మండలంలోని కుకునూరుపల్లిలో లభ్యమైంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని కోల ఆంజనేయులు ఫంక్షన్ హాల్ వద్ద ఆదివారం ఉదయం 70 నుంచి 80 సంవత్సరాల వయసున్న వృద్ధురాలి మృతదేహం పడి ఉండటాన్ని గ్రామ పంచాయతీ సిబ్బంది రాజు గుర్తించి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాడు. వారు ఘటన స్థలానికి చేరుకుని డెడ్‌బాడీని పరిశీలించారు. 5 ఫీట్ల ఎత్తు, చామనచాయ రంగు, పూల రంగు చీరను ధరించి ఉంది. ఈ మేరకు రాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చారు. ఏదైనా సమాచారం కోసం కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

పనివేళలతో పరేషాన్!

- గురుకులాల్లో విద్యార్థుల అవస్థలు
- అద్దె భవనాల్లోని వారి పరిస్థితి మరీ దారుణం
- ఉదయం 8 గంటలకే పాఠాలు
- పాత విధానాన్ని కొనసాగించాలని విన్నపాలు


రంజోల్‌లోని గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు

జహీరాబాద్: అన్ని గురుకుల సొసైటీల్లో ఒకే పని వేళలను ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో చదువులకు తీవ్ర ఆటంకం కలుగుతోందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం 9 గంటలకే ఆరంభం కావాల్సిన తరగతుల నిర్వహణ సమయాన్ని గంట ముందుకు జరపడంతో సమస్యలు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. ఉపాధ్యాయులకు సైతం అవస్థలకు గురిచేస్తోందంటున్నారు.

ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో ఉదయం 8 గంటలకే తరగతులను ప్రారంభిస్తున్నారు. అప్పటి నుంచి 11.15 గంటల వరకు ఏకబిగిన తరగతి గదిలో కూర్చోవడం, కేవలం 10 నిమిషాల వ్యవధిలోనే 600 మంది విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోవడం, ఉదయం స్నానాదులకు కేవలం 15 నిమిషాల సమయం నిర్ణయించడం సమంజసంగా లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఉదయం 7 గంటలకు అల్పాహారం అందించి, మధ్యాహ్నం 1 గంటకు భోజనం పెట్టడంతో ఆకలికి ఆగలేకపోతున్నట్లు పేర్కొంటున్నారు. సాయంత్రం 4.30 గంటలకు స్నాక్స్, 6.30 నిమిషాలకే భోజనం పెట్టడంతో సరిగా తినడం లేదని, నిద్రించే ముందు విద్యార్థులు ఆకలి అంటున్నారని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనివేళలను విద్యార్థులకు అనుగుణంగా సవరించాలని డిమాండ్ చేస్తున్నారు. పాత విధానాన్నే కొనసాగించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు ముక్త కంఠంతో కోరుతున్నారు. ఇప్పటికే గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసనలు సైతం నిర్వహించారు.

ఉపాధ్యాయులకూ తప్పనితిప్పలు

2016–17లో 750 గురుకులాలను ఒకేసారి ప్రారంభించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 41 ఏర్పాటు చేశారు. సాంఘిక సంక్షేమ గురుకులాలు 11, మైనార్టీ 11, బీసీ 6, ఎస్టీ 6 గురుకుల పాఠశాలలు ఉమ్మడి మెదక్ జిల్లాలో నిర్వహిస్తున్నారు. ఇందులో పలు పాఠశాలలకు సొంత భవనాలు లేకపోవడంతో అర కొర సదుపాయాలు ఉన్న అద్దె భవనాల్లో నడుపుతున్నారు. ఇందులో తగినన్ని మరుగుదొడ్లు, స్నానపు గదులు లేక పోవడంతో క్యూలో నిల్చొని అవసరాలు తీర్చుకోవాల్సి వస్తోంది. సొంత భవనాలున్నా పాఠశాలల్లోనూ విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండటంతో ఇవే సమస్యలు ఎదురవుతున్నాయని వారు అంటున్నారు. ఉదయం లేవగానే వ్యాయామం నుంచి టిఫిన్‌ల వరకు అన్ని పనులు చకచకా చేసుకుని 8 గంటలకే తరగతి గదులకు చేరుకోవాలి. సమయాన్ని ఒక గంట ముందుకు జరపడంతో సకాలంలో తరగతి గదులకు చేరుకోలేకపోతున్నట్లు వాపోతున్నారు. అద్దె భవనాల్లో వసతుల కొరత కారణంగా ఉపాధ్యాయులు సమీపంలోని పట్టణ శివారు ప్రాంతాల్లో అద్దెకు ఉంటూ రాకపోకలు సాగించాల్సి వస్తోంది. దీంతో ఉదయం 8 గంటలకు డ్యూటీకి వచ్చిన ఉపాధ్యాయులు కొందరు రాత్రి 9గంటల వరకు కూడా ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నైట్ డ్యూటీ ఉన్న వారు మరుసటి రోజున మధ్యాహ్నం 2.30 గంటల వరకు విధులు నిర్వహించాల్సి వస్తున్నదని వాపోతున్నారు. నైట్ స్టడీ తర్వాత రాత్రి 9 గంటలకు ఇంటికి వెళ్లాలంటే సొంత వాహనం ఉంటే తప్ప వెళ్లలేని పరిస్థితి ఉందంటున్నారు. మహిళలకైతే రక్షణ, భద్రతాపరమైన సమస్యలు కూడా ఉన్నట్లు పలువురు పేర్కొంటున్నారు.

పాత విధానం కొనసాగించాలి



ఉదయం ప్రతీ రోజు స్నానం చేయడం, మరి రెండు జడలు వేసుకోవడానికి అధిక సమయం పడుతున్నది. అల్పాహారం చేసేందుకు సమయం సరిపోవడం లేదు. ఇంతకు ముందు ఉన్నట్లుగా ఉదయం 9 గంటలయితే బాగా ఉండేది. పాత విధానంలోనే కొనసాగించి ఇబ్బందులు తీర్చాలి.

–బిందు, 7వ తరగతి విద్యార్థిని, రంజోల్

5 గంటలకే లేస్తున్నా..



మా కాలేజీలో మొత్తం 720 మంది విద్యార్థులున్నారు. ఉదయం 5 గంటలకే లేచి యోగా, ధ్యానం, మార్నింగ్ వాక్ చేశాక స్నానాలకు వెళ్తున్నాం. తర్వాత టిఫిన్ చేసేందుకు సమయం సరిపోవడం లేదు. దీంతో కొన్ని సందర్భాలలో భోజనం లేక ప్రేయర్ టైంలో పడిపోయే పరిస్థితి.

–పి.రేణుక, ఇంటర్ విద్యార్థిని–రంజోల్

కనీస అవసరాలకు అధిక సమయం



ఉదయం విద్యార్థులంతా కాలకృత్యాలు తీర్చుకునేందుకు అధిక సమయం కావాలి. 10వ, ఇంటర్ వారికి ఎక్కువ పరీక్షలు ఉదయం ఆరు గంటల నుంచి కూడా ఉంటాయి. కాబట్టి 9 గంటలకు పాఠశాలలను నడిపితే సౌకర్యంగా ఉంటుంది.

–ఎం.లలిత, ఉపాధ్యాయురాలు, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల,రంజోల్

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- ప్రియుడితో కలిసి భర్త హత్య
- వివరాలు వెల్లడించిన సీఐ రాజశేఖర్
- అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి.. వీడిన మిస్టరీ


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

హవేళిఘణాపూర్(మెదక్): వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడనే నెపంతో భర్తను భార్య తన ప్రియుడితో కలిసి హత్య చేయించిన ఘటనను పోలీసులు ఛేదించారు. మెదక్‌రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మెదక్ మండలం మక్తభూపతిపూర్‌కి చెందిన బండెవారి నర్సింహులు ఈనెల 16న మెదక్ మండలం కోంటూర్ చెరువు వద్ద అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు విచారిస్తున్నారు. మృతురాలు భార్య సుజాతతో చిన్నశంకరంపేట మండలం వెంకట్రామ్‌పల్లి గ్రామానికి చెందిన కుమ్మరి శ్రీహరితో వివాహేతర సంబంధం పెట్టుకుందని, ఈ విషయం భర్తకు తెలియడంతో సుజాతను కొట్టాడని తెలిసింది. దీంతో వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను హత్య చేయాలని ప్రియుడు కుమ్మరి శ్రీహరితో చెప్పింది. దీంతో పథకం ప్రకారం ఈ నెల 16న శ్రీహరి మక్తభూపతిపూర్‌కు వచ్చి అప్పు ఇస్తానని చెప్పాడు. ఇది నమ్మిన నర్సింహులు తన బైక్‌పై ఇద్దరూ కలిసి అదే రోజు సాయంత్రం మెదక్‌లో మద్యం కొని సాయంత్రం 6 గంటల ప్రాంతంలో కోంటూర్ చెరువు పక్కన కూర్చొని మద్యం తాగారు. ఆ తర్వాత నర్సింహులును శ్రీహరి గొంతునొలిమి చంపి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని సుజాతకు ఫోన్ చేసి చెప్పాడని సీఐ పేర్కొన్నారు. ఆ మేరకు కేసు దర్యాప్తులో భాగంగా నర్సింహులు హత్యకు భార్య సుజాత, శ్రీహరిలు కుట్ర పన్నినట్లు విచారణలో తేలిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ తెలిపారు.

బైక్ అదుపు తప్పి.. రెయిలింగ్‌కు ఢీకొని..

వ్యక్తి మృతి


సాయికుమార్(ఫైల్)

కొల్చారం(నర్సాపూర్): బైక్ పై ప్రయాణిస్తున్న యువకుడు అదుపు తప్పి, రోడ్డు పక్కన ఉన్న రెయిలింగ్‌కు ఢీకొట్టుకొని మృతిచెందాడు. ఈ ఘటన మండలకేంద్రం కొల్చారం మెదక్–ర్సాపూర్ జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కొల్చారం ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపిన వివరాలు... కొడిపల్లి మండలం కొట్టాలకు చెందిన ఎర్రోళ్ల సాయి కుమార్ (24) మెదక్‌లోని ఓ జిరాక్స్ సెంటర్లో డీటీపీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే పని ముగించుకొని శనివారం రాత్రి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. కొల్చారం శివారులోని లోతు వాగు వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న రెయిలింగ్ ను ఢీ కొట్టుకుంది. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయాలై రక్త స్రావం అయింది. విషయం తెలుసుకున్న కొల్చారం పోలీసులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతిచెందాడు. సాయికి ఐదు నెలల క్రితం వివాహమైంది. ఇతని మేనమామ నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనపూర్ చౌరస్తాకు నడుచుకుంటూ వస్తుండగా ..

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... పటాన్‌చెరు మండలం ఘనపూర్‌కు చెందిన రవి (23) సందుగూడెం సమీపంలో ఫ్లిప్ కార్ట్‌లో పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి ఇంటి నుంచి నడుచుకుంటూ ఘనపూర్ చౌరస్తాకు వస్తుండగా సాయిబాబా దేవస్థానం సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రవి తండ్రి దశరథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుడు నర్సింహులుకు అవార్డు ప్రదానం


నర్సింహులును సన్మానిస్తున్న శాలివాహన చారిటబుల్ ట్రస్ట్ నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): కొండాపూర్ మండలం అనంతసాగర్‌కు చెందిన ఉపాధ్యాయుడు నర్సింహులు రాష్ట్ర స్థాయి శాలివాహన విశిష్ట ప్రతిభా అవార్డు అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శాలివాహన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల శాలివాహన ఉత్తమ గురువులైన 62 మందికి రాష్ట్ర స్థాయి శాలివాహన విశిష్ట ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాట్లాడారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింతగా పెంచిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. 14 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో విశిష్ట సేవలు, సామాజిక సేవలు చేసినందుకు గాను అవార్డు వరించింది. కార్యక్రమంలో శాలివాహన ట్రస్ట్ చైర్మన్ ఇటిక్యాల వీరయ్య, రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యాధికారి రమేశ్ కుమార్, ఐఏఎస్ మెంటర్ రవికుమార్, ఏసీబీ డీజీపీతో పాటు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

సూర్యప్రకాశ్‌రావుకు కాళోజీ పురస్కారం


కాళోజీ పురస్కారం అందుకుంటున్న సూర్యప్రకాశ్‌రావు

నర్సాపూర్ రూరల్: మండలంలోని కాగజ్‌మద్దూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఫిజిక్స్ ఉపాధ్యాయుడు, కవి, రచయిత డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్‌రావు ఆదివారం కాళోజీ పురస్కారం అందుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని భారత్ స్కాట్ భవనంలో జరిగిన కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యులు కసిరెడ్డి వెంకటరెడ్డి, ఆచార్య మసన చెన్నప్ప, తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు రావూరి వనజ చేతుల మీదుగా పురస్కారం తీసుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాట్లాడుతూ, కాళోజీ లాంటి వారిని ఆదర్శంగా తీసుకొని మరింత మెరుగైన కవితలు, రచనలను భావితరాలకు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులు, ఆయా శాఖల ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

గుండెపోటుతో ఉద్యమకారుడి కన్నుమూత

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ పరామర్శ


ఎల్లారెడ్డి (ఫైల్)


భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఫారూఖ్

తొగుట(దుబ్బాక): తెలంగాణ ఉద్యమకారుడు, పెద్ద మాసాన్‌పల్లి మాజీ ఎంపీటీసీ పన్యాల ఎల్లారెడ్డి (65) గుండెపోటుతో మృతిచెందారు. శనివారం మధ్యాహ్నం ఛాతీలో నొప్పిగా ఉందంటూ కుటుంబీకులకు తెలిపారు. వెంటనే వారు సిద్దిపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 9 గంటలకు మరణించారు. తెలంగాణ ఉద్యమం సమయంలో క్రియాశీల పాత్ర పోషించారు. 2001లో టీఆర్‌ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీలో పని చేశారు. తెలంగాణవాదాన్ని గ్రామగ్రామానికి తీసుకుపోయి ఉద్యమాన్ని బలోపేతం చేశారు. కొండపాక మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. ఎంపీటీసీగా గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. తర్వాత కాన్గల్ పీఏసీఎస్ డైరెక్టర్‌గా ఐదేళ్లు సేవలందించారు. 2003లో తొగుట ప్రత్యేక మండలంగా ఏర్పాటుతో టీఆర్‌ఎస్ మండల కన్వీనర్‌గా పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పెద్ద మాసాన్‌పల్లికి చేరుకుని కుటుంబాన్ని పరామర్శించారు. పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు.

ఎంపీఓ కవికుమార్ సైతం..


కవికుమార్ (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) గుండెపోటుతో మృతిచెందారు. అక్కన్నపేట మండలంలో దాదాపు నాలుగేళ్లుగా మండల ఎంపీఓ కవికుమార్ విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం హన్మకొండలోని అతని ఇంటి నుంచి ఉదయం వ్యాయామానికి వెళ్లి తిరిగొచ్చారు. ఛాతీలో నొప్పిగా ఉందంటూ ఇంట్లో టీ తాగుతూ ఒక్కసారిగా కింద పడి మృతిచెందారని ఎంపీడీఓ జయరాం తెలిపారు. రానున్న రోజుల్లో డీఎల్‌పీఓగా ప్రమోషన్ పొందవల్సి ఉండగా గుండెపోటుతో మృతిచెందడం పట్ల పంచాయతీ కార్యదర్శులంతా ఆవేదన వ్యక్తం చేశారు. మారుమూల గ్రామాలను సైతం అభివృద్ధిలో ముందుండాలని ఎంతో కృషి చేశారని పలువురు మాజీ సర్పంచ్‌లు ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.

విద్యుదాఘాతంతో ఆరు గేదెలు మృతి


మృత్యువాత పడిన పాడిగేదెలు

నారాయణఖేడ్: విద్యుత్ షాక్‌కు గురై ఆరుపాడి గేదెలు మృతి చెందాయి. ఈ సంఘటన నారాయణఖేడ్ మండలం మంగల్ పేట్ శివారులో జరిగింది. బాధితులు సతీశ్, శివరాజ్ వివరాల ప్రకారం.. రోజూలాగే పాడిగేదెలను మేత కోసం మంగల్‌పేట శివారు ఆర్టీసీ డిపో సమీపంలోని వ్యవసాయ పొలంలోకి తోలాడు. అక్కడి గుంతలో నీరు నిల్వ ఉండటంతో పాటు పక్కనే విద్యుత్ సంభం ఎర్తింగ్ వైర్ ఉంది. జీవాలు మేసుకుంటూ వెళ్లి వైర్‌ను తాకాయి. దీంతో విద్యుత్ షాక్ తగిలి ఆరు పాడిగేదెలు అక్కడే ఉన్న నీటిలో పడి మృతిచెందాయి. దాదాపు రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు సతీశ్, శివరాజ్‌లు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

యోగా ఇన్‌స్ట్రక్టర్లు వచ్చేస్తున్నారు!

- ప్రభుత్వాసుపత్రుల్లో యోగా సేవలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాంట్రాక్టు పద్ధతిన నియామకం
- ఈనెల 26న ఇంటర్వ్యూలు


సిద్దిపేట జిల్లా ఆస్పత్రి

సిద్దిపేటజోన్: జిల్లాలోని యోగా శిక్షకులకు తీపిక బురు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం కోసం వచ్చిన రోగులకు ఇక యోగా సేవలు అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రధానంగా నార్మల్ డెలివరీ లక్ష్యంగా గర్భిణులకు సులువైన యోగా ఆసనాల ద్వారా సత్ఫలితాలు సాధించే దిశగా అడుగులు వేస్తోంది. యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించనుంది. ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని యోగా శిక్షకులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పరోక్షంగా సేవ చేసే భాగ్యం లభించనుంది. ఈ మేరకు ఈనెల 26న సంగారెడ్డి జిల్లాలో ఆయుష్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు.

వివరాలిలా.. ప్రజలు వివిధ రకాల అనారోగ్య సమస్యలతో వైద్యం కోసం ఆస్పత్రికి వస్తున్నారు. మందులతో పాటు రోగులకు మానసిక, శారీరక భరోసా ఇచ్చేందుకు యోగా దోహదపడుతుందని గుర్తించిన ప్రభుత్వం ఈ సేవలు అందించాలని నిర్ణయించింది. అందులో భాగంగానే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని సంకల్పించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్టు పద్ధతి ద్వారా యోగా శిక్షకులను నియమించి వారి ద్వారా సేవలు అందించేందుకు ప్రణాళికలు తయారు చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆస్పత్రుల్లో, వైద్యవిధాన పరిషత్ హాస్పిటల్స్‌లో క్రమం తప్పకుండా యోగా తరగతులు నిర్వహించే బాధ్యతను ప్రభుత్వం యోగా శిక్షకులకు అప్పగించనుంది. నార్మల్ డెలివరీ లక్ష్యంగా గర్భిణులకు సులువైన యోగా ఆసనాలను నేర్పించి వైద్యుల సూచనల మేరకు శిక్షకులు పనిచేయనున్నారు. కాగా, అర్హులైన వారిని ఎంపిక చేసి, వారికి ప్రతీ నెలకు కొన్ని క్లాసుల ఆధారంగా గౌరవ వేతనం రూపంలో ఇవ్వాలని నిర్ణయించారు. పురుషులకు నెలకు రూ. 8 వేలు. స్త్రీలకు రూ. 5 వేలు ఇవ్వనున్నారు. నోటిఫికేషన్ ప్రకారం ఉమ్మడి జిల్లాలో సుమారు 150కి పైగా యోగా శిక్షకులకు అవకాశం ఉంటుందని అంచనా.

సమాన వేతనం ఇవ్వాలి



ప్రభుత్వం ఆస్పత్రుల్లో యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించడం మంచి పరిణామం. కానీ సేవలు అందించే శిక్షకులను పురుష, స్త్రీలని కేటగిరీలుగా చేసి గౌరవ వేతనం తేడా చూపడం సరికాదు. ఇద్దరూ యోగా శిక్షకులే సమానంగా ఇస్తే బాగుంటుంది.

–సతీశ్ (తెలంగాణ యోగాసన సొసైటీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ)

జల్సాలకు అలవాటు పడి చోరీ

- నగల దుకాణంలో దొంగతనం చేసిన నిందితుడి అరెస్టు
- ఐదు బంగారు చైన్‌లు, బైక్ స్వాధీనం
- హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు బైక్‌పై వచ్చి తస్కరణ
- వివరాలు వెల్లడించిన ఏసీపీ మధు, సీఐ ఉపేందర్


నిందితుడిని చూపుతున్న ఏసీపీ మధు, సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తదితరులు

సిద్దిపేటకమాన్: పట్టణంలోని ఓ నగల దుకాణంలో పట్టపగలే చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. అతని నుంచి సొత్తు రికవరీ చేశారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను సీఐ ఉపేందర్‌తో కలిసి ఏసీపీ మధు తెలిపారు. ఆంధ్ర విశాఖపట్నం మద్దిలపాలెంకు చెందిన వేపంచ షణ్ముక రెడ్డి (24) పీజీ చదువుతూ ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. అతడు జల్సాలకు అలవాటు పడ్డాడు. ఖర్చుల కోసం సులభంగా డబ్బులు సంపాదించాలని బంగారు నగలు దొంగిలించి వాటిని విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. హైదరాబాద్‌లో ఉంటున్న తన స్నేహితుడి వద్ద అవసరం ఉందని చెప్పి బైక్ తీసుకున్నాడు. హైదరాబాద్‌లో దొంగతనానికి పాల్పడితే పట్టుబడే అవకాశం ఉంటుందని భావించి సిద్దిపేటకు బైక్ పై ఈనెల 18న వచ్చాడు. పట్టణంలోని లాల్ కమాన్ సమీపంలోని నయిమ్ మియా బంగారు షాపునకు వెళ్లి బరువు ఎక్కువ ఉన్న చైన్‌లు చూపించాలని షాప్ వారిని అడిగాడు. వారు చూపిస్తుండగానే చైన్‌లు చూస్తున్నట్లుగా నటిస్తూ బంగారు చైన్‌లు ఉన్న బాక్స్‌ను దొంగిలించి పక్క సందులో ముందుగా పార్క్ చేసి ఉన్న బైక్‌పై పారిపోయాడు. దీంతో బాధితులు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు బైక్‌పై హైదరాబాద్ వెళ్తూ టోల్‌గేట్ వద్ద ఉన్న సిబ్బందిని చూసి పోలీసులు అనుకుని భయపడి బైక్‌ను అతివేగంతో నడిపి కిందపడటంతో గాయపడ్డాడు. గమనించిన టోల్‌గేట్ సిబ్బంది అతడికి ప్రథమ చికిత్స చేసిన అనంతరం పంపించారు. నిందితుడు అదే బైక్‌పై వచ్చి ప్రజ్ఞాపూర్‌లోని కనకదుర్గ పార్కింగ్ సెంటర్‌లో పార్క్ చేసి అదే రోజు బస్సులో హైదరాబాద్ వెళ్లాడు. బంగారాన్ని హైదరాబాద్‌లో విక్రయిస్తే పట్టుబడతానని అనుమానంతో ఈ నెల 21న ఉదయం ప్రజ్ఞాపూర్ వచ్చాడు. పార్కింగ్‌లో పార్క్ చేసిన బైక్‌ను తీసుకుని కరీంనగర్ వైపు వెళ్తుండగా పట్టణంలోని రంగీలాదాబా చౌరస్తా వద్ద టూటౌన్ సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఇక్కడి నుంచి పారిపోయే ప్రయత్నం చేశాడు. దీంతో పోలీసులు సీసీ పుటేజీ సహాయంతో అతడి కదలికలను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో తాను చేసిన దొంగతనాన్ని ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. 8 తులాల 5 బంగారు చైన్‌లు, చోరీకి ఉపయోగించిన బైక్, రెడ్ కలర్ షర్ట్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. అతడిని చాకచక్యంగా పట్టుకున్న సీఐ ఉపేందర్, ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, సిబ్బంది సుధాకర్‌రెడ్డి, ప్రశాంత్, యాదగిరి, ప్రవీణ్‌లను సీపీ అనురాధ అభినందించారని, త్వరలో రివార్డు అందజేస్తారని తెలిపారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే డయల్ 100కు కాల్ చేయాలన్నారు.